క్లుప్తంగా

నేడు చిరుమర్తిలో రైతు వేదిక ప్రారంభం

మాడుగులపల్లి: మండలంలో చిరుమర్తి గ్రామంలో నిర్మించిన రైతు వేదికను గురువారం ప్రారంభించనున్నట్లు ఎంపీపీ పోకల శ్రీవిద్యరాజు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, రైతుబంధు సమితి సభ్యులు, ముఖ్య నాయకులు, అధికారులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ముగిసిన ధాన్యం కొనుగోళ్లు



మాడుగులపల్లి కొనుగోలు కేంద్రంలో లారీలోకి బస్తాలు లోడ్ చేస్తున్న హమాలీలు

మాడుగులపల్లి: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయి. బుధవారం రాశులను పూర్తిగా కాంటా వేసి బస్తాలకు లారీలకు లోడ్ చేశారు. నాలుగు లారీలను రప్పించి పేరుకుపోయిన బస్తాలను సైతం మిల్లులకు తరలించారు. ఈ కొనుగోలు కేంద్రం ఏప్రిల్ 17న ప్రారంభమైంది. 45 రోజుల్లో 300 మంది రైతుల నుంచి 36వేల క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి వెంకటయ్య తెలిపారు. రైతులకు ఇబ్బంది లేకుండా బిల్లులను వెంటనే చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. కాగా వేములపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో కుక్కడంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో వారం క్రితమే కొనుగోళ్లు పూర్తికాగా చెరువుపల్లిలో కొనుగోళ్లు తుది దశకు చేరాయి.

పట్టణ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా లలిత



మాజీ మంత్రి జానారెడ్డి చేతులమీదుగా నియామకపత్రం అందుకుంటున్న లలిత

మిర్యాలగూడ: మిర్యాలగూడ పట్టణ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా పట్టణానికి చెందిన లలిత ఎన్నికయ్యారు. ఈ మేరకు మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లలితకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జానారెడ్డి మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు పాటుపడాలన్నారు. అనంతరం లలిత మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి తన వంతు కృషిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు కృష్ణయ్య, నాయకులు దైద సంజీవరెడ్డి, అలుగుబెల్లి అమరేందర్‌రెడ్డి, పాదిల వెంకన్న, సలీం, ఇమ్రాన్, సోమయ్య, పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నరేశ్ కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న నేనావత్ కిషన్‌నాయక్

చందంపేట: మండలంలోని బాపన్‌మోట్‌తండాకు చెందిన జర్పుల నరేశ్ ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురై హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ జాతీయ కోఆర్డినేటర్ నేనావత్ కిషన్‌నాయక్ బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో నరేశ్ కుటుంబ సభ్యులకు రూ.50వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట మునినాయక్, రాము, మోతీలాల్, హరి, పవన్ తదితరులున్నారు.

ఆడబిడ్డ వివాహానికి రూ.10వేల ఆర్థికసాయం



మధారిగూడెంలో ఆడబిడ్డ వివాహానికి నగదు అందజేస్తున్న మన్నెం రంజిత్‌యాదవ్

హాలియా: అనుముల మండలంలోని మధారిగూడెంలో నిరుపేద కుటుంబానికి చెందిన సీత కొండలు కుమార్తె రేణుక వివాహం గురువారం జరగనుంది. దీంతో వివాహ ఖర్చుల నిమిత్తం బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మన్నెం రంజిత్‌యాదవ్ ఆ నిరుపేద కుటుంబానికి రూ.10వేల ఆర్థికసాయాన్ని బుధవారం అందజేశారు. కార్యక్రమంలో మండల ఎంపీపీ పేర్ల సుమతీపురుషోత్తం, మైనార్టీ జిల్లా నాయకుడు అంజాద్‌ఖాన్, ఉద్యమకారుడు షేక్ మక్బూల్, మండల మైనార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ జానీ, మోటమర్రి సురేందర్ ఉన్నారు.

నత్తనడకన ఆరోగ్య ఉపకేంద్రం పనులు

- మాటూరులో పిల్లర్ల దశలోనే ఆగిపోయిన నిర్మాణం
- ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న గిరిజనులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



మాటూర్‌లో పిల్లర్ల దశలోనే ఆగిపోయిన ఆరోగ్య ఉప కేంద్రం పనులు

త్రిపురారం: నిరుపేదలకు గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందిచాలని రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుంటే.. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. మండలంలోని మాటూరు గ్రామపంచాయతీ పరిధితో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో 90శాతం గిరిజన జనాభా ఉంది. దీంతో ప్రభుత్వం మాటూరు గ్రామంలో తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆరోగ్య ఉపకేంద్రం నిర్మించాలని రూ.16 లక్షల నిధులు కేటాయించింది. దీంతో ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణానికి ఫిబ్రవరి 2, 2022న నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పనులు పిల్లర్ల స్థాయిలోనే ఉన్నాయి. దీంతో ఈ ప్రాంత గిరిజనులకు ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షగానే మిగిలింది.

ప్రైవేట్ ఆస్పత్రులతో ఆర్థిక ఇబ్బందులు..

మాటూరు గ్రామపంచాయతీలో నిర్మిస్తున్న ఆరోగ్య ఉప కేంద్రం వల్ల చౌళ్లతండా, రాగడప, కుంకుడుచెట్టుతండా, పలుగుతండా, పాల్తీతండా, లచ్యతండా, కాపువారిగూడెం, రూప్లతండా, అప్పలమ్మగూడెం, లోక్యాతండా, బడాయిగడ్డ, డొంకతండా గ్రామపంచాయతీల్లోని గిరిజనులకు ప్రభుత్వ వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. అయితే మండల కేంద్రం దూరంగా ఉండడం సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో ప్రభుత్వ వైద్య సేవలు అందక ఇక్కడి గిరిజనులు నిత్యం వైద్య చేయించుకోవడానికి మిర్యాలగూడ పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. కొందరు గ్రామస్తులు అవగాహన లేక వైద్యం చేయించుకోకపోవడం వల్ల మరణించిన దాఖలాలు కూడా ఉన్నాయి. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు సరైన వైద్యం అందక అనేక ఇబ్బందులు పడుతున్నారు. మాటూర్‌లో ఆరోగ్య ఉప కేంద్రాన్ని త్వరగా పూర్తిచేయాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

కాంట్రాక్టర్ల నిర్లక్ష్యమే కారణం



సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రం పనులు పూర్తి కావడంలేదు. గ్రామస్తులకు ప్రభుత్వ వైద్యం అందకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రుకు వెళ్లి నష్టపోతున్నారు. ఆరోగ్య ఉప కేంద్రం నిర్మిస్తే తండావాసులకు ఉపయోగకరంగా ఉంటుంది. అధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తిచేసి వైద్య సిబ్బందిని నియమించాలి. – ధనావత్ వెంకట్రాం, మాటూర్

అభివృద్ధిలో జాప్యం తగదు



అభివృద్ధి పనుల్లో జాప్యం చేయడం సరికాదు. అధికారుల అలసత్వం వల్ల పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలు అందించడం అత్యవసరం. పల్లెల్లో వైద్య సేవలపై అవగాహన లేక సరైన సమయంలో వైద్యం అందక పేదలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోతున్నారు. – కసిరెడ్డి సరేష్, యువజన సంఘం నాయకుడు, త్రిపురారం

యాంత్రీకరణతో సాగు ఖర్చులు తగ్గించవచ్చు



నేరుగా వరి విత్తనాలు విత్తే యంత్రంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు

త్రిపురారం: రైతులు వ్యవసాయంలో యంత్రాలను వినియోగించడం వల్ల కూలీల కొరతను అధిగమించడంతో పాటుగా పెట్టుబడి ఖర్చులను తగ్గించుకొని అధిక దిగుబడులు సాధించవ్చని కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం త్రిపురారం మండలంలోని బొర్రాయిపాలెం గ్రామంలో పొడి దుక్కిలో నేరుగా వరి విత్తనాలు విత్తే యంత్రం, విత్తే పద్ధతులపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అనువైన విత్తన రకాలు, విత్తుకోవాల్సిన సమయం, కలుపు నివారణకు ఉపయోగించే మందుల వాడకం, భూసార పరీక్షలు, ఎరువుల యాజమాన్యం ఆవశ్యకతను తెలియజేశారు. వరి పంటకు ఆశించే చీడపీడల నివారణ చర్యలు, వాతావరణంలో మార్పులు, వ్యవసాయ సమాచారం తెలియజేసే పలు సోషల్ మీడియా యాప్‌లపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం నేరుగా విత్తే పద్ధతి ద్వారా వరి పంటను పండించిన రైతులు వారి అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు చంద్రశేఖర్, రాములమ్మ, పల్లవి, సైదులు, వెంకట్‌రెడ్డి, నర్సయ్య, శ్రీనివాస్, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

పోడు అవకతవకలపై విచారణ చేపట్టాలి

మిర్యాలగూడ: దామరచర్ల గ్రామంలో పోడు భూములను కాజేసేందుకు కుట్ర చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని లంబాడీ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి నీలకంఠం నాయక్ బుధవారం ఆయన మిర్యాలగూడ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బినామీ పేర్లతో పోడు భూములకు దరఖాస్తులు పెట్టించి అట్టి భూములను పొందేందుకు కొందరు కబ్జాదారులు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపించారు. బినామీ పేర్లను పెట్టినందుకుగాను ఎకరానికి రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు ఇస్తున్నారని, వీరి పేర్ల మీద పోడు భూముల పట్టాలు రాగానే తిరిగి భూకబ్జాదారులకు ఇచ్చేటట్లుగా ఒప్పందం చేసుకుంటున్నారని అన్నారు. దామరచర్ల మండల కేంద్రంలో పోడు భూముల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని పూర్తిస్థాయిలో విచారించి అర్హులైన వారికి మాత్రమే పోడు భూముల పట్టాలు అందించాలని, బినామీ పేర్లతో దరఖాస్తు చేసుకున్న వాటిని రద్దు చేసి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

చింతపల్లి: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. బుధవారం చింతపల్లి మండల పరిధిలోని వింజమూరు గ్రామ సమీపంలో నిర్మించిన కలియుగ హరిహర క్షేత్రం(వేంకటేశ్వర స్వామి దేవాలయం)లో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార రామానుజ జీయర్ స్వామి ఉపన్యాసాలు, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, కుంభం శ్రీశైలం, రాతకొండ రుద్రమ్మదేవి, పొగాకు శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాళి..

కొండమల్లేపల్లి: మండలంలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని బుడ్డోనితండాకు చెందిన మాజీ ఎంపీటీసీ మూడావత్ పాండునాయక్ మాతృమూర్తి మూడావత్ ఫన్నీబాయి మృతి బాధాకరమని దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ అన్నారు. బుధవారం ఆమె మృతదేహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కుంభం శ్రీనివాస్‌గౌడ్, పస్నూరి యుగంధర్‌రెడ్డి, రమావత్ దస్రూనాయక్, మేకల శ్రీనివాస్‌యాదవ్, రావుల సత్యనారాయణ, రమావత్ తులసీరామ్, వస్కుల కృష్ణ, సిద్ధు ఉన్నారు.



చింతపల్లి: వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్



చింతపల్లి: భక్తులకు ప్రవచనాలు వినిపిస్తున్న రామానుజ జీయర్ స్వామి

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి



దామరచర్లలో కూలీలతో మాట్లాడుతున్న నారి ఐలయ్య

మిర్యాలగూడ: ఉపాధి హామీ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య అన్నారు. బుధవారం దామరచర్లలోని ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 5న జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట చేపట్టనున్న ధర్నాలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పిల్లుట్ల సైదులు, బాలసైదులు, వెంకట్‌రెడ్డి, మట్టయ్య, జ్యోతి, శీనయ్య, హేమానాయక్, బుజ్జి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చకచకా రోడ్డు పునరుద్ధరణ పనులు



మాడుగులపల్లి-ఇందుగుల మధ్య జరుగుతున్న రోడ్డు పునరుద్ధరణ పనులు

మాడుగులపల్లి: మండల కేంద్రం నుంచి ఇందుగుల వెళ్లే రహదారిలో కిలోమీటరు మేర రోడ్డు పూర్తిగా దెబ్బతిని వాహనాలు ప్రయాణించేందుకు వీల్లేకుండా తయారైంది. వర్షం కురిస్తే గుంతల్లో నీళ్లు నిలిచి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడేవి. వాహనదారులు, ప్రయాణికుల ఇబ్బందిని గుర్తించిన ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డును కిలోమీటరు మేర పూర్తిగా పునరుద్ధరించాలని, ఇందుకు రూ.40లక్షలు అవసరమని ప్రభుత్వానికి నివేదించారు. ఇటీవల నిధులు విడుదల కావడంతో పనులు చకచకా కొనసాగుతున్నాయి. ఇప్పటికే రోడ్డుపై కంకర పరిచి మట్టిపోసి చదును చేశారు. మరో 15 రోజుల్లో బీటీ వేయనున్నట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ దినేశ్‌రెడ్డి తెలిపారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కోదాడ-జడ్చర్ల హైవే ప్రమాదాలపై అవగాహన



రైతులు, వ్యాపారస్తులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ రమేష్

నిడమనూరు: మండలంలోని నర్సింహులగూడెం వద్ద కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారిపై జరిగే ప్రమాదాల గురించి గ్రామానికి చెందిన రైతులు, వ్యాపారస్తులకు నిడమనూరు ఏఎస్‌ఐ రమేష్ బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. హైవే వెంట ఉండడం వల్ల అజాగ్రత్తగా రోడ్డు మీదికి వస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. రాత్రిళ్లు హైవేపై భారీ వాహనాలు వస్తుంటాయని, డ్రైవర్లు నిద్ర మత్తులో ఉండే అవకాశం ఉంటుందని తెలిపారు. రైతులు తమ పశువులను రోడ్డు మీదికి వదలొద్దని సూచించారు. వేసవి కాలంలో ఆరుబయట నిద్రించే వారు విలువైన ఆభరణాలు ఒంటిపై ధరించవద్దని, ఇంట్లో భద్రపర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మృతురాలికి నివాళులర్పించిన జానారెడ్డి

హాలియా: అనుముల మండలంలోని చల్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రావుల శ్రీనివాస్‌యాదవ్ తల్లి రావుల ఆకుమంచమ్మ అనారోగ్యంతో మంగళవారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి బుధవారం ఆమె నివాసానికి వెళ్లి శ్రీనివాస్‌యాదవ్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా రావుల ఆకుమంచమ్మ చిత్రపటానికి జానారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, హాలియా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.



ఆకుమంచమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జానారెడ్డి

దశాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలి



దేవరకొండ: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్



మిర్యాలగూడ: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు



హాలియా: మాట్లాడుతున్న జిల్లా హౌజింగ్ పీడీ రాజ్‌కుమార్



పెద్దవూర: మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయకుమారి



త్రిపురారం: సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పాండమ్మ

దేవరకొండ: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్ 2 నుంచి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న దశాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. బుధవారం దేవరకొండ పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన ఉత్సవాల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జూన్ 2 నుంచి 22 వరకు దశాబ్ది ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆర్డీఓ గోపీరాం, ఎంపీపీలు మాధవరం సునీతాజనార్దన్‌రావు, వంగాల ప్రతాప్‌రెడ్డి, ఏడీఏ వీరప్ప, పల్లా ప్రవీణ్‌రెడ్డి, తూం నాగార్జున్‌రెడ్డి, ముక్కమల బాలయ్య, వెల్గూరి వల్లపురెడ్డి, శ్రీనివాస్‌రావు, ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను విజయవంతం చేయాలి..

మిర్యాలగూడ: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని ఎంవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 21 రోజులపాటు జరిగే దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఆయా రంగాల్లో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని ఫ్లెక్సీల రూపంలో విస్తృత ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ చెన్నయ్య, రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, ఎంపీపీ నూకల సరళాహన్మంతరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కుర్ర కోటేశ్వర్‌రావు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

పండుగలా దశాబ్ది వేడుకలు జరుపుకోవాలి

త్రిపురారం: దశాబ్ది వేడుకలను గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పండుగలా జరుపుకోవాలని ఎంపీపీ అనుముల పాండమ్మ, నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం త్రిపురారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో దశాబ్ది ఉత్సవాలపై అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎంపీపీ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ సూచనల మేరకు ఆయా శాఖల అధికారులు ప్రజలతో మమేకమై ఉత్సవాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అలివేలు మంగమ్మ, తహసీల్దార్ కేసీ ప్రమీల, వైస్ ఎంపీపీ మట్టయ్య, త్రిపురారం సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ గౌరవ సలహాదారు అనుముల శ్రీనివాస్‌రెడ్డి, సూపరింటెండెంట్ సత్యప్రభ, ఎంపీఓ భిక్షంరాజ్, అధికారులు, కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

హాలియాలో..

హాలియా: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా హౌజింగ్ పీడీ రాజ్‌కుమార్ అన్నారు. జూన్ 2 నుంచి చేపట్టాల్సిన దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై బుధవారం హాలియా మండలంలోని కొత్తపల్లి రైతు వేదికలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం దశాబ్ది ఉత్సవాలకు సంబంధించి పలు సలహాలు, సూచనలు చేశారు.

ఆయా శాఖల ఆధ్వర్యంలో చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మంగ, ఏడీఏ రవీందర్, పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

పెద్దవూరలో..

పెద్దవూర: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎంపీడీఓ కూన్‌రెడ్డి విజయకుమారి అన్నారు. బుధవారం పెద్దవూర మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురిగి సైదులుగౌడ్, ఏఓ కె. సందీప్, ఐసీడీఎస్ అనుముల ప్రాజెక్టు సీడీపీఓ గంధం పద్మావతి, మండల వైద్యాధికారి నగేష్, పశువైద్యాధికారి చంద్రబాబు, ఆర్‌ఐ దండ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరిలో..

తిరుమలగిరి(నాగార్జునసాగర్): తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని ఎంపీడీఓ ఖాజా అస్గర్ అలీ అన్నారు. బుధవారం తిరుమలగిరి మండల కేంద్రంలో నిర్వహించిన మండలస్థాయి అధికారులు, ఉపాధి సిబ్బంది, అంగన్‌వాడీ, పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో తహసీల్దార్ పాండునాయక్, ఏఓ జానకిరాములు, ఏపీఎం లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్షలో ప్రతిభ చాటిన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రైమ్ అకాడమీ డైరెక్టర్ శ్రీనివాస్

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలోని ప్రైమ్ అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులు గురుకుల ప్రవేశ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు అకాడమీ డైరెక్టర్ శ్రీనివాస్ బుధవారం తెలిపారు. తమ అకాడమీలో శిక్షణ పొందిన 22 మంది విద్యార్థుల్లో 21 మంది వివిధ సొసైటీల గురుకుల పాఠశాలలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అకాడమీ డైరెక్టర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు కె. ఆనంద్, అనంతలక్ష్మి, శ్వేత తదితరులు అభినందించారు.

ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

అడవిదేవులపల్లి: మండలంలోని చిట్యాల గ్రామంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కురాకుల చినరామయ్య, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నాగార్జున, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు ఆంకాల కాశయ్య, జిలకర కుంటతండా సర్పంచ్ కుర్ర పకీరానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఓటమి.. గెలుపునకు నాంది కావాలి



పెద్దవూర గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న ఏటీడీఓ రమేష్‌కుమార్

పెద్దవూర: అపజయం అనేది విజయానికి నాంది కావాలని జిల్లా సహాయ గిరిజన అభివృద్ధి అధికారి(ఏటీడీఓ) కె. రమేష్‌కుమార్ అన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గిరిజన సంక్షేమ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో చదువుతూ ఏప్రిల్‌లో నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు పెద్దవూర మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణా శిబిరాన్ని ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షల్లో ఫెయిలైనంత మాత్రాన నిరుత్సాహపడకుండా విజయం కోసం కృషిచేయాలని అన్నారు. సబ్జెక్టుల్లో వచ్చిన అనుమానాలను ఉపాధ్యాయులతో నివృత్తి చేసుకుని శ్రద్ధగా చదివి మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. అంతకుముందు విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను, ప్రతిరోజు సబ్జెక్టుల వారీగా నిర్వహిస్తున్న స్లిప్ టెస్టుల మార్కులను పరిశీలించారు. ఆయన వెంట ఏసీఎంఓ డీవీ నాయక్, వసతి గృహ సంక్షేమ అధికారి కొల్లు బాలకృష్ణ, ఉపాధ్యాయులు కూన్‌రెడ్డి రాంరెడ్డి, ఎండీ షబ్బీర్, బి. కృష్ణ, డి. శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న నిడమనూరు ఎస్‌ఐ శోభన్‌బాబు

త్రిపురారం: మండలంలోని కొణతాలపల్లికి చెందిన పెద్ది సైదులు అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. నిరుపేద అయిన మృతుడి కుటుంబ సభ్యులకు బుధవారం నిడమనూరు ఎస్‌ఐ శోభన్‌బాబు మానవతా దృక్పథంతో రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. అనంతరం సైదులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

చందంపేట: ప్రభుత్వ ఉద్యోగులు ఉత్తమ సేవలు అందించినప్పుడే ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని తహసీల్దార్ దేవదాసు అన్నారు. చందంపేట తహసీల్దార్ కార్యాలయంలో సబార్డినేట్‌గా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన లక్ష్మమ్మను బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో డీటీ ముక్తార్, ఆర్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి, డీలర్ల సంఘం అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్, పచ్చిపాల కృష్ణయ్య, భాషానాయక్, కేతావత్ శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మమ్మను సన్మానిస్తున్న అధికారులు